ప్రజాశక్తి

గురువారం 27 ఫిబ్రవరి 2025

5

విజయనగరం



నేడు ఉన్నత పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలలకు ఈనెల 27 గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెలవు దినంగా ప్రకటించినట్లు జిల్లా విద్యా శాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు తెలిపారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునే నిమిత్తం స్థానిక సెలవు ప్రకటించినట్లు తెలిపారు. డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు తమ పరిధిలో పాఠశాలలకు సెలవు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి స్థానానికి గురువారం జరుగనున్న ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాలకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

- నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- ఉత్తరాంధ్రలో 22,493 మంది ఓటర్లు.. 123 పోలింగ్ కేంద్రాలు
- విజయనగరం జిల్లాలో 5223 , పార్వతీపురం మన్యంలో 2333 మంది ఓటర్లు
- కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల అధికారులు, సిబ్బంది



సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



విజయనగరం పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్లను సరిచూసుకుంటున్న సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో మొత్తం 5,223 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 3,270 మంది పురుషులు కాగా, 1953 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరంలో ఓటర్ల సంఖ్య 2166 ఉండటంతో, వీరికోసం మహారాజా ప్రభుత్వ సంగీత నత్య కళాశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిగిలిన అన్నిమండల కేంద్రాల్లో కూడా ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్దా ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమేరాల ద్వారా వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తారు. దీంతోపాటు పోలింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారు. గురువారం ఉదయం 8 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓటర్లు ప్రభుత్వం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకువెళ్లాల్సి ఉంటుంది.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు
విజయనగరం	29
మన్యం	15
శ్రీకాకుళం	31
విశాఖపట్నం	13
అనకాపల్లి	24
ఎఎస్ఆర్	11
మొత్తం కేంద్రాలు	**123**

పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయడానికి సుమారు 175 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పిఒ (ప్రిసైడింగ్ ఆఫీసర్), ఎపిఒ, ఇద్దరు అదనపు పోలింగ్ అధికారులు, ఒక సూక్ష్మ పరిశీలకులను నియమించారు. జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయాలవద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం డివిజన్లో 4 రూట్లు, చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్లో రెండేసి రూట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో రూట్ పర్యవేక్షణకు ఒక రూట్ ఆఫీసర్, ఒక సెక్టార్ ఆఫీసర్‌ను నియమించారు. ఆర్‌డిఒ కార్యాలయాలవద్ద పోలింగ్ సిబ్బందికి బుధవారం ఉదయమే ఎన్నికల సామగ్రిని అందజేశారు. మొత్తం 8 బస్సుల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లారు. ఈ ప్రక్రియను ఎంఎల్‌సి ఎన్నికలకు ఎఆర్‌ఒగా

జిల్లా	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు
విజయనగరం	5,223	3,270	1,953
పార్వతీపురంమన్యం	2,333	1,574	759
శ్రీకాకుళం	5,035	3,416	1,619
విశాఖపట్నం	5,529	2,539	2,990
అనకాపల్లి	2,885	1,789	1,096
ఎఎస్ఆర్	1,488	920	568
మొత్తం	**22,493**	**13,508**	**8,985**

వ్యవహరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆయా డివిజన్ల ఆర్‌డిఒలు పర్యవేక్షించారు.

జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ చీపురుపల్లిలో పర్యటించారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌డిఒ సత్యవాణితో మాట్లాడి ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న విజయనగరం ఆర్‌డిఒ కీర్తి



బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

అందరి నోటా.. విజయగౌరి మాట

- గెలుపు ధీమాలో పిడిఎఫ్
- కూటమి మద్దతు తీసుకోవడంపై ఎపిటిఎఫ్‌లో అంతర్మథనం
- గాదె, వర్మలకు విజయగౌరే ప్రత్యామ్నాయం అంటున్న గురువులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నేడు (గురువారం) జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులు, మేధావులు, ఉద్యోగుల నోట పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మాటే ఎక్కువగా వినిపిస్తోంది. విజయ అవకాశాలు ఆమెకే ఉంటాయన్న విశ్లేషణలు ఊపందుకున్నాయి. పోలింగ్‌కు ఇంకా కొన్ని గంటలు మాత్రమే సమయం ఉండడంతో సమీకరణాలన్నీ విజయగౌరికి మద్దతుగా మారుతున్నాయి. దీంతో, పిడిఎఫ్ మద్దతుదారులంతా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో యుటిఎఫ్ నాయకురాలిగా విజయగౌరి చూపిన చొరవ, నిజాయితీ, నిబద్ధత, కుటుంబ నేపథ్యం, పిడిఎఫ్ తరపున పోటీ చేయడం ఇందుకు ముఖ్య కారణాలుగా చెప్పుకోవచ్చు. దీనికి తోడు పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఎపిటిఎఫ్, పిఆర్‌టియుల్లో అంతర్మథనం మొదలైంది. ఎంతైనా ఉపాధ్యాయులు, వారి సంఘాల మధ్య పోటీ ఉండాలి తప్ప, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పడమే కాకుండా, నిలదీసిన నాయకులపై నిర్బంధాలు, బెదిరింపులకు పాల్పడిన పార్టీల పంచన చేరిపోవడం సరికాదనే చర్చ రెండు రోజులుగా యావత్తు ఉపాధ్యాయ రంగంలో నడుస్తోంది. ముఖ్యంగా ఎపిటిఎఫ్ తరపున బరిలో నిలిచిన రఘువర్మకు మద్ధతుగా టిడిపి నేతలు నేరుగా రంగంలోకి దిగి ప్రచారం చేయడం ఆ సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులకు మింగుపడడం లేదు. 'ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మనం అధికార పార్టీ మద్ధతుతో గెలిస్తే తిరిగి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించగలమా'? అంటూ ఆ సంఘంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతున్నట్టుగా సమాచారం. ఈనేపథ్యంలో ఎపిటిఎఫ్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉద్యమాల్లో ఆరితేరిన విజయగౌరివైపు చూస్తున్నారు. అటు ఓటమి తప్పదని భావించిన గాదె శ్రీనివాసుల నాయుడు కులం, ప్రాంతం తెరపైకి తెచ్చారు. ఇది కూడా పిఆర్‌టియులోని చాలా మంది ఉపాధ్యాయులకు నచ్చడం లేదు. ఇలాంటి పరిస్థితులో గాదె కన్నా విజయగౌరి మిన్న అన్నట్టుగా ఎక్కుమంది భావించారు. తొలి నుంచీ ప్రధానమైన పోటీ ఈ ముగ్గురి మధ్యే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడినప్పటికీ తాజాగా పరిణామాలు విజయగౌరికి మరింత సానుకూలంగా మారాయి. మిగిలిన ఏడుగురు అభ్యర్థులు పెద్దగా ప్రభావితం చేసే అవకాశం లేకపోవడంతో ఆమె గెలుపు సునాయాశం అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

500 మందితో బందోబస్తు : ఎస్‌పి



ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 27 మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 29 పోలింగు కేంద్రాల వద్ద సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. భద్రత ఏర్పాట్లును నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత డిఎస్‌పిలను, ఇతర అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికను సజావుగా, ప్రశాంతయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని భద్రత చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగు కేంద్రానికి 200మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు, మద్దతుదారులు ఎటువంటి టెంటులు, స్టాల్స్ ఏర్పాటు చేయకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఓటు హక్కు వినియోగించేందుకు వచ్చే ఓటర్లకు ఇచ్చే స్లిప్‌లపై రాజకీయ పార్టీలు, వ్యక్తులకు సంబంధించిన ఎటువంటి గుర్తులు లేకుండా చూడాలన్నారు. ఓటు హక్కు వినియోగించు కొనేందుకు వచ్చే ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఎన్నికల అధికారులు, భద్రత విధులు నిర్వహించే పోలీసు అధికారులు మినహా ఎవరూ పోలింగు కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో సెల్ ఫోన్లు, వైర్లెస్ సెట్స్ వినియోగించుకుండా చూడాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గాను రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలట్ బాక్స్ లను విశాఖపట్నంకు సురక్షితంగా తరలించేందుకు భద్రతా ఏర్పాట్లును సంబంధిత డిఎస్‌పిలు, సిఐలు పర్యవేక్షించాలని తెలిపారు.

కెజిబివిల్లో ఎపిసి తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ ఎ.రామారావు బుధవారం రాజాం, వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లో కెజిబివిలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో పరిసరాలను, వంటగదిని, తరగతి గదులను పరిశీలించారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. స్టడీ హవర్స్‌ను పరిశీలించారు. అనంతరం వంగర కెజిబివిలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పదో తరగతి , ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 'పంచతంత్ర విధానం' అనుసరించి రాష్ట్రస్థాయిలోనే జిల్లా కెజిబివిలను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎపిసి రామారావు

జ్వరాల నివారణకు తక్షణ చర్యలు : కలెక్టర్

- మారుమూల గిరిజన గ్రామాలకు వైద్య బృందాలు
- ఏరియా ఆసుపత్రిలో 11 మందికి చికిత్స
- పర్యవేక్షించిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్.కోట మండలం దారపర్తి సచివాలయ పరిధిలోని నాలుగు గిరిశిఖర గిరిజన గ్రామాల్లో ప్రబలిన వైరల్ జ్వరాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బుధవారం తక్షణ చర్యలు చేపట్టింది. గిరిజన గ్రామాలైన కురిడి, గూనపాడు, శనగపాడు, రాయిపాలెంకు రెండు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను పంపించి జ్వరపీడితులను గుర్తించి వారికి గ్రామంలోనే వైద్య సహాయం అందించే ఏర్పాట్లను చేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జీవనరాణి చెప్పారు. ఒక్కో బృందం రెండు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాధితులను గుర్తిస్తుందని, ఈ బృందంలో వైద్యాధికారితోపాటు ఎఎన్ఎం, ఆశాకార్యకర్తలు ఉంటారని తెలిపారు.

ఎస్.కోట ఏరియా ఆసుపత్రిలో 11మందిని చేర్పించి చికిత్స అందిస్తున్నామని, వీరందరికీ దద్దుర్ల(రేషెస్)తో కూడిన సాధారణ వైరల్ జ్వరాలే సోకాయని, ఎవరికీ ప్రాణభయం లేదని డిఎంహెచ్ఒ చెప్పారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని డిఎంహెచ్ఒ జీవనరాణి సందర్శించి జ్వరపీడితులకు అందిస్తున్న వైద్య సహాయాన్ని పర్యవేక్షించారు. వైద్యాధికారి డాక్టర్ బి.శిరీష ఆధ్వర్యంలో వైద్యుల బృందం వారి చికిత్స ఏర్పాట్లు చూస్తోంది. గిరిజన గ్రామాల్లో అందరికీ వారి గ్రామంలోనే పూర్తిస్థాయి వైద్యం అందించి పూర్తిగా జ్వరం తగ్గే వరకు అవసరమైన మందులు అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.



ఏరియా ఆస్పత్రిలో చిన్నారులను పరామర్శిస్తున్న డిఎంహెచ్ఒ

శివాలయాలకు పోటెత్తిన యాత్రికులు

- కిక్కిరిసిన రామతీర్థం, పుణ్యగిరి ఆలయాలు
- రామతీర్థంలో మత్స్యకారుల జాగరణ



రామతీర్థం ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల/శృంగవరపుకోట

మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. జిల్లాలో ప్రదానమైన నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం రామస్వామి దేవస్థానం, ఎస్.కోటలోని పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయం, ధర్మవరం వద్ద గల సన్యాసేశ్వర స్వామి ఆలయం, వంగర మండలంలోని సంగమేశ్వర స్వామి ఆలయం, మెంటాడ మండలంలోని జయతిలోని భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయాలు వేలాది మందితో కిక్కిరిసిపోయాయి.

శివరాత్రి జాతరను పురస్కరించుకొని భక్తులు రామతీర్థం రామస్వామి దేవస్థానానికి పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి భక్తులు రామ కోనేరులో స్నానాలు చేసి, తలనీలాలు సమర్పించి సీతారామ స్వాములను దర్శించుకున్నారు. సంప్రదాయ ప్రకారం పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన మత్స్య కారులు జాతరకు వచ్చి తెల్ల వారు జాము వరకు కోలాటాలు జరిపి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సీతాసమేత రామ లక్ష్మణ స్వాములను దర్శించుకొని దేవస్థానం క్షేత్ర పాలకుడు ఉమా సదాశివస్వామిని కూడా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే శివ రాత్రి జాతర లో భక్తులు వంటలు చేసుకొని గురు భక్తుల కొండ, దుర్గ భైరవ కొండ, భీమునిగుహ, నీలాచల బోడికొండ మీద కొందండ రామ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల దర్శనం కోసం క్యూలైన్లు, బారికేడ్లను, రామ కోనేరులో స్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లతో పాటు తాగు నీటి సౌకర్యం, సతివాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తొలుత భక్తుల తాకిడి తక్కువగా ఉన్నప్పటికి క్రమేపి జన సందోహం పెరిగింది. దూర ప్రాంతాలకు చెందినవారు శివరాత్రి జగరాలు చేసి రాత్రికి దర్శనాలు చేసుకొని మరుచటి రోజు వంటలు చేసుకొని స్వగ్రామాలకు వెళ్తారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతి రాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీని వాసరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉదయం నుంచే పోటెత్తిన భక్తులు

శృంగవరపుకోట: దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి మహా శైవ క్షేత్రం, ధర్మవరం వద్ద గల సన్యాసేశ్వర స్వామి దేవాలయం మండలంలో గల శివాలయాలు మహా శివరాత్రి సందర్భంగా శివనామస్మరణలతో మార్మోగాయి. బుధవారం ఉదయం ఐదు గంటల నుండే ఈ క్షేత్రాలకి భక్తుల తాకిడి మొదల యింది. సన్యాసేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి కోనేరులో స్నానాలు ఆచరించగా మరికొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి సన్యాసేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుణ్యగిరి కొండపై గల శ్రీ ఉమా కోటి లింగేశ్వర స్వామి ఆలయం పుట్టదార వద్ద భక్తులు పుణ్యస్నానాలు చేసి ఉమా కోటి లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుణ్యగిరి దర్శనానికి వెళ్ళే భక్తులకు ఎండ తగలకుండా టెంట్లను ఏర్పాటు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. పుణ్యగిరి శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులు దర్శనానికి వెళ్లేందుకు ఒక మార్గం, దర్శనం చేసుకుని కొండ దిగేందుకు మరొక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ కోట ఆర్‌టిసి డిపో నుండి పది నిమిషాలకు ఒక బస్సు చొప్పున రెండు క్షేత్రాలకు 15 బస్సులను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం, ఉచిత ప్రసాద వితరణ వంటివి దేవాదాయ శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీస్ శాఖ 300 మంది పోలీసు సిబ్బందితో పది అత్యవసర ప్రదేశాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేసి భక్తులకు భద్రతను కల్పించారు. ఈ రెండు క్షేత్రాల వద్ద భక్తులకు కల్పించిన ఏర్పాట్లను డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. మరో రెండు రోజుల వరకు పుణ్యగిరి, సన్యాసేశ్వర స్వామి ఆలయాలకు భక్తుల తాకిడి ఉంటుందని ఆలయ ఇఒలు నాగేంద్ర, ప్రసాద్‌రావులు తెలిపారు.



పుణ్యగిరి కొండపైకి దర్శనానికి వెళ్తున్న యాత్రికులు



రామతీర్థంలో రామస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్ర

మహాశివరాత్రి సందర్భంగా భర్తపురం శ్రీ ప్రసన్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వరస్వామి వారి ఆలయం వరకు పాదయాత్ర చేస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు పుణ్యగిరి కొండ పైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-చీపురుపల్లి



ఆకర్షణీయంగా ముఖద్వారం సెట్టు

మార్చి 2,3,4 తేదీలలో జరగనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సంబంధించి ఆలయ కమిటీతో పాటు ఆలయ ఇఒ బి శ్రీనివాసరావు ఇతర అధికారులు జాతర ఏర్పాట్లను ముమ్మరం చేశారు. జాతరకు మూడు రోజులే సమయం ఉండడంతో జాతర ఏర్పాట్లలో కమిటీ సభ్యులు, అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఉన్నతాధికారుల నుండి కింది స్థాయి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు ఎప్పటికప్పుడు జాతర ఏర్పాట్లుని పర్యవేక్షిస్తున్నారు. చీపురుపల్లి పట్టణం నుండి అమ్మవారి ఆలయం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర విద్యుత్ అలంకరణను చేపట్టారు. అందులో భాగంగానే చీపురుపల్లి లావేరు రోడ్లు ఓ మూడు భారీ కటౌట్‌లను ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వినోదం కలిగించేందుకు తోవ పొడుగునా భారీ విద్యుత్ అలంకరణలు చేశారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ ఎపి మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హెచ్.శైలజ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2025-2026 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒబిసి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు కులం, జనన ధ్రువ పత్రం, ఆదాయం ధ్రువపత్రం ఆధార్ కార్డు ఉండాలని బిసి, ఒబిసిలకు 150 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలకు 75రూపాయలు పరీక్ష రుసుము చెల్లించి మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఇంగ్లీష్ మీడియంలో జరిగితుందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గుర్తింపు పొందిన ప్రభుత్వం, ప్రయివేట్ విద్యాసంస్థలో చదివి ఉండాలని ఇతర సమాచారం కోసం ఫోన్ నెంబర్ 8121845319, 7702937355, 9866956432 సంప్రదించాలని ప్రిన్సిపాల్ శైలజ కోరారు.



మొదటి బహుమతిని అందుకుంటున్న క్రీడాకారులు

మండల స్థాయి క్రికెట్‌లో విజయం

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని వసంత విహార వద్ద గత వారం రోజుల నుంచి జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో వసంత విహార్ యూత్ జట్టు ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో కర్రిచిన్నయ్యపాలెం గ్రామం మీద వసంత విహార్ యూత్ ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్, వార్డు సభ్యులు కర్రీ సూర్యనూకరాజు, అరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. క్రీడా పోటీలు తెలుగు యువత చంద్రశేఖర్ రాజు (చిన్న), గవరవరపు సంతోష్, మహేష్, నాగరాజు, రవి, లెంక అర్జున్, వసంత విహార్ యూత్ సభ్యుల సహకారంతో జరిగిందన్నారు. మొదటి బహుమతి గెలుచుకున్న వసంత విహార్ యూత్ సభ్యులకు రూ.10వేలు, రెండవ బహుమతి సాధించిన కర్రిచిన్నాయపాలెం జట్టుకు రూ. 5వేలు, దేశభద్రంపాలెం జట్టుకు మూడో బహుమతిగా రూ.3వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వసంత విహార్ యూత్ ఈశ్వరరావు, లోహిత్, శంకర్, ప్రకాష్, ఉపేంద్ర, భార్గవ్, మహేష్, నాని, సాయి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



ప్రేయర్ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

సత్య కళాశాలలో బ్లెస్సింగ్ కార్యక్రమం

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సింగపూర్‌కు చెందిన చాంగ్ హ్యా టాంగ్ ట్యూ టెక్ హ్యాసంస్థ ఆధ్వర్యాన గురూజీ హాంగ్‌తో బ్లెస్సింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చాంగ్ హ్యా టాంగ్ ట్యు టెక్ హ్యా సంస్థ గురూజీ హాంగ్ బుద్ధునికి ప్రేయర్ నిర్వహించి, విద్యార్థులకు కళాశాల సిబ్బందికి సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావుకు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణికి దీవెనలు అందించారు. అనంతరం గురూజీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్యవేణి, ఎన్ ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బెల్లాన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

విజయనగరం మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు మండల వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. బాబూజీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద్, బెల్లాన త్రినాధరావు, రేవల్ల సత్తిబాబు, పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, కొమ్ము చిరంజీవి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024 - 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకోవాలని అడ్మిన్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ప్రతిరోజు సచివాలయాల వారీగా వసూలు చేస్తున్న ఆస్తిపన్ను వివరాలపై సమీక్షించారు. తక్కువగా పన్ను వసూలు చేసిన కార్యదర్శులను మందలించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొద్ది రోజులే మిగిలి ఉన్న కారణంగా ఇకనైనా శ్రమించి పన్ను వసూళ్ళను శతశాతం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఎఒ సీతారామమూర్తి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాంసం విక్రయ దుకాణాలపై చర్యలు

మహా శివరాత్రిని పురస్కరించుకుని మాంసం విక్రయాలు చేపట్టిన దుకాణాలకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అపరాధ రుసుములను విధించి దుకాణాలను మూసి వేయించారు. బుధవారం నగరంలోని పలుచోట్ల పర్యటించిన ఆయన పారిశుధ్య విధానాన్ని పరిశీలించారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీ కొట్టులను, వ్యాపారాలను అక్కడి నుంచి తరలించి వేశారు నగరంలో మాంసం విక్రయాలు చేపట్టరాదని ప్రకటించినప్పటికీ కొంతమంది దుకాణాలు తెరిచి మాంసవిక్రయాలు సాగించడంతో ఆయా షాపుల వద్దకు వెళ్లి అపరాధ రుసుము విధించారు కంటోన్మెంట్, ఎస్‌బిటి మార్కెట్ ప్రాంతంలో తెరిచి ఉన్న చికెన్ దుకాణం వద్దకు వెళ్లి రూ.3వేలు అపరాధ రుసుము విధించారు.

కిటకిటలాడిన శివాలయాలు



వంగర: నదుల సంగమంలో స్నానాలు చేస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి- వంగర

మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని సంగంలో గల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద వారం రోజులు పాటు జరిగే ఉత్సవాలకు మొదటిరోజు బుధవారం విజయనగరం పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున పోటెత్తారు. నాగావళి, సువర్ణముఖి, వేగావతి మూడు నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద స్నానాలు చేసి సంగమేశ్వర స్వామి ఆలయంలో వెళ్లి పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున జనం తరలి రావడంతో క్యూ లైన్‌లో ఎక్కువసేపు ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మన్యం జిల్లా వీరఘట్టం మండలం నీలానగరానికి చెందిన పురుషోత్తమనాయుడు యాత్రికులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు, రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు యాత్ర స్థలంలోనే ఉండి పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్ఐ షేక్ శంకర్‌తో పాటు, రేగిడి సంతకవిటి రాజాం ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు.

> మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం పలు శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ముఖ్యంగా రెండో భద్రాద్రిగా పేరొందిన రామతీర్థం రామస్వామి దేవాలయం, ఎస్‌కోట మండలం పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయాయి. వంగర మండలం సంగంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు భారులు తీరారు. మెంటాడ మండలంలోని జయతిలో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మంత్రులు కొండపల్లి శ్రీనివాసరావు, గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

చీపురుపల్లి: మహా శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలలో సుమారు 60 వరకు శివాలయాలున్నాయి. ఉదయం మూడు గంటల నుండే శివారాధన కోసం భక్తులు బారులు తీరారు. చీపురుపల్లి పట్టణంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వర దేవాలయంలో జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి జిల్లా నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద్, టిడిపి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దే బాబూరావు, మండల టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, ఆర్‌ఎసియస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావుతో పాటు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శివాలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

వేపాడ: మహాశివరాత్రి సందర్భంగా వేపాడ, సింగరాయి, బానాది గ్రామాల్లో బుధవారం అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. రాత్రికి శివాలయాలు వద్ద భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగారాలు జరుపుకుని పుణ్యగిరి శివాలయానికి మండలంలో పలు గ్రామాల నుండి తరలి వెళ్ళనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

శివాలయంలో మంత్రుల పూజలు

మెంటాడ: మండలంలోని జయతి గ్రామంలో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో శివరూపమైన శివలింగాన్ని భక్తిశ్రద్ధలతో మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, టిడిపి మెంటాడ మండల అధ్యక్షులు చలమూరు వెంకటరావు, టిడిపి సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, రెడ్డి రాజగోపాల్, అనిల్, కొరిపిల్లి చిన్నంనాయుడు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చాపాన జోగినాయుడు పాల్గొన్నారు.



మెంటాడ: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రులు



నెల్లిమర్ల: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్‌పి కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి



రామకోనేరులో స్నానాలు చేస్తున్న యాత్రికులు



ఎస్‌కోట : వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ఇనుప కంచె వేస్తే పొలాల్లోకి వెళ్లేదెలా?

●విమానాశ్రయానికి వెళ్లే రహదారికి కంచె వేస్తున్న అధికారులు ● ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారి నుంచి అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్ళేందుకు కొత్తగా నిర్మిస్తున్న రహదారికి ఇరువైపులా ఇనుప కంచెను వేస్తున్నారు. ఇనుప కంచె వేయడం వల్ల రైతులు భూముల్లోకి నడిచి వెళ్ళేందుకు కూడా రహదారి లేకుండా పోయిందని పొలాల్లోకి ఎలా వెళతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తమ పొలాల్లోకి వెళ్ళే విధంగా తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

విమానాశ్రయానికి వెళ్ళేందుకు ఉప్పాడపేట జంక్షను సమీపంలో జాతీయ రహదారి నుంచి రెడ్డికంచేరు వరకు రహదారిని నిర్మించాల్సి ఉంది. దీనిలో భాగంగా జాతీయ రహదారిలోని ట్రంపెట్ వద్ద రైతులకు ఇంకా పరిహారం అందజేయకపోవడంతో ట్రంపెట్‌కు అర కిలోమీటరు దూరం నుంచి రెండు నెలలుగా రహదారి పనులు గూడెపువలస మూడు ఆలయాల వరకు జోరుగా జరుగుతున్నాయి.

రైతులు పొలాల్లోకి వెళ్ళకుండా ఇనుప కంచెలు

కొత్తగా నిర్మిస్తున్న ఈ రహదారికి ఇరువైపులా ఇనుప కంచె వేస్తున్నారు. దీంతో రైతులు తమ పొలాల్లోకి వెళ్ళేందుకు అవకాశం లేదు. రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు



రహదారి నుంచి పొలంలోకి వెళ్ళకుండా వేసిన ఇనుప కంచె

పడతామని రైతులు వాపోతున్నారు. ఈ రహదారికి ఆనుకొని ఎక్కువగా కొబ్బరి తోటలు ఉన్నాయి. ఈ కొబ్బరి తోటలను ప్రతి ఏడాది ట్రాక్టర్లుతో దుక్కి దున్నుతుంటారు. పంట కాపుకు వస్తే కొబ్బరికాయలను ట్రాక్టర్లు, ఆటోలు ద్వారా తరలిస్తుంటారు. కంచె ఏర్పాటు చేయడం వల్ల పొలాల్లోకి ట్రాక్టర్లు వెళ్ళే పరిస్థితి లేదు. పంటను కూడా బయటకు పంపించే అవకాశం లేదు. దీంతో రైతుల్లో ప్రస్తుతం ఆందోళన నెలకొంది. ఇలా నిర్మించడం వల్ల తమ భూములకు అమ్ముకుందామన్న విలువ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవేలో మాదిరి కనీసం సర్వీసు రహదారినైనా నిర్మించాలని కోరుతున్నారు.



పొలాలకు ఎలా వెళ్ళాలో తెలియడం లేదు

పొలాల్లోకి వెళ్ళేందుకు వీలు లేకుండా ఏకంగా ఇనుప కంచెను రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారు. దీంతో పొలాల్లోకి ఎలా వెళ్ళాలో తెలియడం లేదు. దీని వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఉంది. అందుకు అధికారులు స్పందించి మా పొలాల్లోకి వెళ్ళే విధంగా రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

కొల్లి రామ్మూర్తి, రైతు, గూడెపువలస

పొలాలు దున్నేందుకు ట్రాక్టరు ఎలా తీసుకువెళ్ళాలి



నాకు ఎకరా కొబ్బరితోట ఈ రహదారికి ఆనుకొని ఉంది. ఏడాదికి ఒకసారి ఖచ్చితంగా కొబ్బరి తోటను ట్రాక్టరుతో దున్నిస్తాను. కాని ఇప్పుడు పొలంలోకి వెళ్ళేందుకు అవకాశం లేదు. ఏకంగా ఇనుప కంచె వేసి వెళ్ళకుండా చేసేస్తున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు. రైతుని ఇబ్బంది పెట్టే పనిచేయడం దుర్మార్గం.

మాతా శిరోమణి, రైతు, భోగాపురం

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి - వంగర

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలలో పదవ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడమే తమ లక్ష్యమని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల సమన్వయకర్త శంభాన రూపవతి అన్నారు. ఈ మేరకు ఆమె మండలంలోని మద్దువలసలో గల గురు కులంను బుధవారం పరిశీలించారు. విద్యార్థినిలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని అందరూ చక్కగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు గురుకులంకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గురుకులంలో రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల అంబేద్కర్ గురుకులాలలో 13 గురుకులాలకు సంబంధించి 10వ తరగతిలో 930 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 670 మంది, ద్వితీయ సంవత్సరంలో 530 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 33/11కేవీ పూల్ బాగ్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి పూల్‌బాగ్ ఫీడర్ పనుల కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. లక్ష్మీ గణపతి కాలనీ, సుబ్రహ్మణ్యం స్వామి టెంపుల్ ఏరియా, జగదాంబ నగర్, గోల్డెన్ వ్యాలీ లేఅవుట్, పూల్ బాగ్ కాలని, మెయిన్ రోడ్, హాజీ ఆలీ నగర్, మంగళ వీధి కాలనీలో విద్యుత్‌కోత ఉంటుందని తెలిపారు.

ప్రయివేటు స్కూళ్ల ఇష్టారాజ్యం

●బస్సులలో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు ● అనుమతి లేకుండా వసతి గృహాల నిర్వహణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా మండలంలో ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని పాఠశాలలు మూసివేత దిశగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా తీసుకుని మండలంలో ఇప్పటికే



పరిమితికి మించి బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు

17 ప్రైవేట్ పాఠశాలలు ఒక అనుమతులు లేని ప్లే స్కూలు ఉన్నాయి. ప్రయివేటు స్కూళ్ల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతునే ఉంది. ఇక్కడ ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారంపై ప్రశ్నించే వారే లేకపోవడమే దీనికి కారణం.

మండలంలోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు స్కూళ్ల నిర్వహణలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతులు లేని బస్సులలో సీట్ల పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా స్కూల్లల్లో హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ బుక్స్, యూనిఫామ్, షూ, బెల్ట్స్ వంటివి స్కూళ్లలోనే అమ్మకాలు సాగిస్తున్నారు. ఇవన్నీ మండల విద్యాశాఖ అధికారికి తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదు. తన కళ్ళ ముందే ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు విద్యాహక్కు చట్టాలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై భారాలు వేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు



కేంబ్రిడ్జి స్కూల్ అనుమతులతో నిర్వహిస్తున్న నారాయణ స్కూల్

తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విషయమే ఎంఇఒ నర్సింగరావు వద్ద ప్రజాశక్తి ప్రశ్నించగా ప్రైవేటు స్కూళ్ల విషయంలో తానేమి చేయలేనని జిల్లా విద్యాశాఖ అధికారులే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పైగా మీరు నాకు తెలియజేశారు కదా చూస్తానులే అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. ఆ వెంటనే 'మీ ప్రైవేటు స్కూళ్ల నిర్వహణ బాగోలేదంటూ ఫిర్యాదులు చేస్తున్నారని ప్రైవేట్ స్కూలు యజమానులకు ఫోన్ చేసి మరి ఆయనే చెప్పడం విడ్డూరంగా ఉంది. జిల్లా యంత్రాంగం స్పందించి ఇక్కడ ఎంఇఒతో పాటు ప్రయివేటు స్కూళ్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - చీపురుపల్లి



చీపురుపల్లి: ఏర్పాట్లును పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజారావు

ఈ నెల 27న గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహశీల్దారు నమ్మి రాజారావు తెలిపారు. చీపురుపల్లి బాలుర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ బూత్‌ని ఆర్ఐ రామ్ కుమార్‌తో కలసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ సమయానికి ముందే ఎన్నికల సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. తహసీల్దారు వెంట విఆర్‌ఎ శంకరరావు తదితరులున్నారు.

రామభద్రపురం: ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. ఇక్కడ 52వ పోలింగ్ కేంద్రంలో 82 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. పిఒ, ఎపిఒ, ఒపిఒతో కలిపి 6గురు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఎఎస్‌ఒ మధుసూదనరావు ఆధ్వర్యంలో ఎన్నికలు ఉదయం 8 నుంచి సాయింత్రం 4 వరకు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఎన్నికల సామాగ్రితో సిబ్బంది చేరుకొని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు.

గంట్యాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి బుధవారం మధ్యాహ్నం పోలింగ్ సామాగ్రితో ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలను తహశీల్దార్ నీలకంటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో 150 ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చీటీల నిర్వాహకుడు అరెస్టు

●మూడు నెలల కిందట కుటుంబమంతా పరారీ

●రాజమండ్రిలో భార్యతో సహా అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

చీటీలు, అప్పుల పేరిట ప్రజలను మోసం చేసి కుటుంబంతో పరారైన మోసగాడిని పోలీసులు పట్టుకొని అతనితో పాటు అతని భార్యను కూడా అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు తరలించారు. భోగాపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి మురళి గ్రామంలో గత కొన్నాళ్లుగా చీటీలు నిర్వహించేవాడు. అనేకమంది వద్ద అప్పులు కూడా చేశాడు. గతేడాది అక్టోబర్ నెలలో తనకు ముగ్గురు వ్యక్తులు మోసం చేశారని లేఖ రాసి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. దీంతో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. కానీ ఆస్పత్రి నుంచే పరారయ్యేందుకు ప్రయత్నించడంతో చీటీలు, అప్పుల బాధితులు ఆసుపత్రిలోనే కాపలా కాయాల్సిన పరిస్థితి వచ్చింది. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో బాధితులు కూడా నిలదీశారు. అందరికీ డబ్బులు చెల్లిస్తానని చెబుతూనే మూడు నెలల కిందట ఇద్దరు పిల్లలు, భార్య, తల్లితో కలిసి పరారయ్యాడు. దీంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. చివరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ ఎన్.వి ప్రభాకర్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. రాజమండ్రిలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు మంగళవారం వెళ్లి ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. రాజమండ్రి నుంచి మురళితోపాటు అతని భార్య తులసినీ బుధవారం ఇక్కడకు తీసుకువచ్చి ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

రెండు చోట్ల అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కింజంగిలో బుధవారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల గంట లక్ష్మికి చెందిన పెంకిటిల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాగ్రి అంతా కాలి బూడిదైంది. అలాగే మండల కేంద్రంలోని ఆర్‌సిఎం చర్చి సమీపంలో కర్రి రాములకు చెందిన గడ్డి కుప్ప, దేవకివాడ రామినాయుడు, రౌతు ఆసిరినాయుడులకు చెందిన జీడి మామిడి, టేకు చెట్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న రాజాం అగ్నిమాపక ఇన్చార్జి అధికారి టి.మోహన్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా ఘటనా స్థలాలకు వెళ్లి మంటలను అదుపు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని కొత్త ఎరుకుల వీధికి చెందిన యువకుడు గేదెల సోములు(29) మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వివరాలు మేరకు తాపీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్న సోములుకు క్షణికావేశం ఉండడంతో ఇంటిలో చిన్న గొడవ జరిగితే చనిపోతానని బెదిరించే వాడని, మంగళవారం రాత్రి ఇంటిలో చిన్న గొడవ జరగడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
O.S.No 508/2022.

Between:
1. Smt Potluri Rajasri,
2. Sri Potluri Murali Krishna,
3. Sri Potluri Dharani Krishna,
4. Sri Potluri Vamsi Krishna. ......Plaintiffs.
And:
1. Sri Nimmagadda Satyanarayana,
2. Sri Potluri Butchibabu. .....Defendants.
To
THE DEFENDANT No 2:
Sri Potluri Butchibabu S/o Subhash Chandra Bose, Hindu, aged about 42 Years, Resident of F-6, R.K.Sadan, Indira Nagar. Vizianagaram Town, Vizianagaram District.

Please take notice that the above named Plaintiffs instituted the above matter against you. Further, along with the said suit, the plaintiff also filed I.A.No 364/2022 for temporary injunction against you. The said suit and the said interim application stands posted to **7th day of April 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.